## క్లుప్తంగా

### మంగరాయునికి ప్రత్యేక అలంకరణ



వెండి అలంకరణలో మంగరాయ ఆంజనేయస్వామి

**ఆదోని అర్బన్:** పట్టణశివారు మంగరాయ కాలనీలో వెలిసిన ఆంజనేయస్వామిని మంగళ వారం ప్రత్యేకంగా వెండి ఆభరణాలతో స్వామిని అలంకరించారు. ఆలయ మేనేజర్ వాసుదేవరావు, పూజారి గురురాజా ఆచారి ఆధ్వర్యంలో స్వామికి వేకువజామున ఫల పంచామృతాభిషేకం, తేనాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు చేయించిన వెండి ఆభరణాలతో స్వామివారికి అలంకరించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థ మహాస్వాముల వారి సూచనల మేరకు ప్రతి మంగళవారం స్వామివారికి వెండితో అలంకరిస్తున్నట్లు తెలిపారు.

### ముగిసిన సుంకులమ్మవ్వ దేవర



ప్రత్యేక అలంకరణలో సుంకులమ్మవ్వ

**ఆదోని అర్బన్:** పట్టణంలోని ఆర్టీసీ కొత్త బస్టాండు రోడ్డులోని ఆర్అండ్బీ గెస్ట్ హౌస్ సమీపంలో వెలసిన సుంకులమ్మవ్వ దేవర మహోత్సవం మంగళవారం ఘనంగా ముగిసింది. వేకువ జాము నుంచి అమ్మవారికి సప్త నది జలాలతో మహాభిషేకం, వస్త్రాలంకరణ, పంచామృతాభిషేకం, మహామంగళహారతి, కుంభోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

### కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

**ఆదోని రూరల్:** ఆదోని పట్టణం పర్వతాపురానికి చెందిన పింజరి దూద్‌పీరా ఏపీ 21 ఏపీ 1355 నంబర్ గల బజాజ్ బైకుపై అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు ఇస్పీ ఎస్ఐ విజయలక్ష్మి విలేకరులకు తెలిపారు. దూద్‌పీరా కర్ణాటక నుంచి మోటార్ బైకుపై 180 ఎంఎల్ పరిమాణం గల ఒరిజినల్ చాయిస్ 96 టెట్రా ప్యాకెట్లు, 90 ఎంఎల్ పరిమాణం 36 టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా మదిరె సమీపంలో పట్టుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

### నలుగురిపై కేసు నమోదు

**ఆదోని రూరల్:** మండంలోని ధణాపురం గ్రామంలో పొలం గట్టు తగాదా విషయంలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇస్పీ ఎస్ఐ విజయలక్ష్మి మంగళవారం విలేకరులకు తెలిపారు. ధణాపురం గ్రామానికి చెందిన కందుకూరి వీరేష్, భార్య మహాదేవి, మరో వర్గానికి చెందిన మహానంది, భార్య శారదపై పొలం గట్టు తగాదా విషయంలో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

### వేసవి శిబిరానికి విశేష స్పందన



తాము గీసిన చిత్రాలతో చిన్నారులు

**పెద్దకడబూరు:** మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం లైబ్రేరియన్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఆశాజ్యోతి మాట్లాడుతూ.. గత సంవత్సరం కంటే విద్యార్థులు అధిక సంఖ్యలో శిబిరానికి వస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.

### గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

**కోసిగి:** వేసవి కాలంలో గ్రంథాలయాలను ఉపయోగించుకుని పరిజ్ఞానం పెంచుకోవాలని కోసిగి గ్రంథాలయ అధికారి దుళ్లయ్య సూచించారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. విద్యార్థులచే కథలు, కథనాలు, బుక్ రీడింగ్, సృజనాత్మకత పోటీలు, డ్యాన్స్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో సమయం వృథా చేయకుండా గ్రంథాలయంలో లభించే జనరల్ నాలెడ్జ్, న్యూస్ పేపర్స్, కథలు, చందమామ పుస్తకాలు చదువుకోవాలని సూచించారు. జూన్ 12వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం ఉంటుందని ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలన్నారు.

# నాలుగేళ్ల 'నవ'వసంతం

- వైఎస్సార్‌సీపీ పాలన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పండుగలా వేడుకలు
- కుల, మతం, ప్రాంతం, వర్గాలు చూడకుండా నవరత్నాల సంక్షేమ పథకాలు
- ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

**ఆదోనిటౌన్:** రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం, తొలి సంతకం చేసి నేటికి నాలుగేళ్లు పూర్తయ్యింది. ఈ సందర్భంగా ఆదోనిలో పండుగ వాతావరణంలో వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు. కేక్ కటింగ్, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం ఎస్కేడీ కాలనీలోని మహబూబియా ప్యాలెస్‌లో 'జగనన్న సంతకానికి నాలుగేళ్లు' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, యువనేత జయమనోజ్ రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. కులం, మతం, ప్రాంతం, వర్గం అని చూడకుండా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే దరి చేరుతున్నాయన్నారు. ఎన్నికల ముందు జగనన్న ఇచ్చిన హామీలలో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. పేదరికంతో మగ్గిపోయే కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ప్రజల మద్దతుతో 2024 ఎన్నికల్లో భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ విమర్శలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలు ఉన్నత చదువులు చదుకోవాలని నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను ప్రవేటుకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. వలంటీర్లు, గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఎలాంటి సమస్యనైనా సచివాలయాల ద్వారా ఒకటి రెండు రోజుల్లోనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. 14 ఏళ్ల చంద్రబాబునాయుడు పాలనలో 700 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా పరిష్కరించలేక పోయారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాలను తెలుసుకుంటూ సమస్యలను పరిష్కరిస్తానని యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రజలు మెచ్చుకునే విధంగా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతిపక్షాలకు కనిపించడం లేదని, వారికి కళ్లు ఉన్నా కబోదిలా వ్యవహరిస్తున్నాయని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ అన్నారు. పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, పట్టణ కన్వీనర్ మధుసూదన్‌శర్మ, కన్వీనర్ సన్ని, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్‌గౌస్, నరసింహులు, మార్కెట్‌యార్డు చైర్మన్ మజహర్ అహ్మద్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, దేవదాస్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

### కోర్టు ఉత్తర్వులు వచ్చేవరకు చర్యలు తీసుకోలేం

**ఆదోని రూరల్:** మండలంలోని పాండవగల్ పెద్ద చెరువు విషయం హైకోర్టు పరిధిలో ఉందని, కోర్టు ఉత్తర్వులు వచ్చేంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేమని ఆదోని తహసీల్దార్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. గత నాలుగు రోజులుగా పాండవగల్లు పెద్ద చెరువు సాధన కమిటీ సభ్యులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం తహసీల్దార్ విలేకరులతో మాట్లాడారు. పాండవగల్లులోని పెద్దచెరువు సర్వే నంబర్ 135/1లో 20.40 ఎకరాలు ఉందని, ఇది మొదటగా ఇనాం భూమిగా ఉండేదని, 1956లో అప్పటి తహసీల్దార్ రైతులకు పట్టాలు జారీ చేశారన్నారు. అనంతరం గ్రామ పటంలో చెరువుగా నమోదైందన్నారు. 1990లో విజయలక్ష్మి అనే మహిళ రైతుల వద్ద రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసిందని, అందుకు పాసు పుస్తకాలు కూడా మంజూరయ్యాయన్నారు. 2013లో పాసు పుస్తకాలను రెవెన్యూ అధికారులు రద్దు చేశారని, దీంతో విజయలక్ష్మి హైకోర్టులో రిట్ పిటీషన్ వేశారన్నారు. దీనిపై కోర్టు స్టే ఇచ్చిందని, ఆ భూమిపై కోర్టు తుది ఉత్తర్వులు వచ్చేంతవరకు తామేమి చేయలేని తహసీల్దార్ స్పష్టం చేశారు.

## జేజేఎం ద్వారా ఇంటింటికీ కుళాయి



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి

**కోసిగి:** మండలంలోని 28 గ్రామాలకు జలజీవన్ మిషన్ (జేజేఎం) పథకం కింద రెండు విడుతలుగా రూ.16 కోట్లు మంజూరైందని త్వరలోనే ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి సురక్షిత మంచి నీటిని అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జేజేఎం కింద రూ.10 లక్షలతో గొడుగల్లు గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తుంబిగనూరులో పైప్‌లైన్ ఏర్పాటైందని, కోసిగిలో స్టోరేజ్ ట్యాంక్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలను గ్రామ సచివాలయం ద్వారానే పరిష్కరిస్తున్నారని, పరిష్కారం కానివి తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ రుద్రగౌడ కోరారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా చేసేందుకు గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సహకరించాలని హౌసింగ్ ఏఈ శేఖర్ బాబు కోరారు. ఐరన్‌గల్లు గ్రామ విద్యుత్ లైన్‌మెన్ పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రామాంజినేయులు హౌసింగ్ ఏఈ వీరేష్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వివిధ శాఖ అధికారులు తమ పనితీరు వివరించారు. జడ్పీటీసీ పవిత్ర పాటిల్, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు మహంతేష్ స్వామి, సర్పంచ్ అయ్యమ్మ, పంచాయతీ రాజ్ ఏఈ యుగంధర్ రెడ్డి, ఏపీఎం సత్యమ్మ, ఏపీఓ జయరామ్, సీఆర్‌పీ అనంతరామ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## కనులపండువగా గంగా జయంతి



గంగామాత ఉత్సవమూర్తి ఊరేగింపు నిర్వహిస్తున్న గంగపుత్ర కులస్తులు

**ఆదోని అర్బన్:** స్థానిక ఎమ్మిగనూరు రోడ్డులో వెలసిన గంగాభవానీ ఆలయంలో మంగళవారం గంగాజయంతి సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండిగిరి సుంకులమ్మ దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించి ఆలయంలో పూజలు చేసి తుంగభద్ర గంగా జలాలను ఊరేగింపుగా గంగాభవానీ ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య చిన్నారులు, మహిళలు కలశాలతో పాల్గొనగా ప్రధాన రహదారిలో ఊరేగింపు చేశారు. గంగాభవాని ఉత్సవ మూర్తిని, గంగామాత చిత్రపటాన్ని వాహనంలో ఉంచి ఆలయం నుంచి స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న మహాయోగి లక్ష్మమ్మవ్వ దేవాలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ఊరేగింపు కనులపండువగా సాగింది. మహాయోగి లక్ష్మమ్మవ్వకు పూజలు చేసి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఈరన్న, బేల్దారి శ్రీనివాసులు, టైలర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## జీవాలకు మెరుగైన వైద్య సేవలు

**కోసిగి:** మూగ జీవాల వద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నట్లు సంచార వాహన పశు వైద్యాధికారి డి.షలీనా పేర్కొన్నారు. మంగళవారం కోసిగి మండలంలోని నేలకోసిగి, కందుకూరు, జంపాపురం, సజ్జలగుడ్డం, కౌతాళం మండలంలోని పొదల కుంట, మల్లన హట్టి, కుంటనహాల్ గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహన సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు అందించిన సమాచారం ఆధారంగా ఆవులు, గేదెలు, ఎద్దులకు వైద్య చికిత్స చేశారు. నేలకోసిగి గ్రామంలో ఒక ఆవుకు ప్రమాదవశాత్తు కాలు విరగడంతో చికిత్స అందించారు. వాహనంలోనే అన్నీ విధాలుగా పశువులకు అవసరమయ్యే మందులు, చికిత్స కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మూగ జీవాలకు ఆరోగ్య క్షీణించినా, ప్రమాదవశాత్తు గాయాలైనా వాహనం టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే వెంటనే అక్కడికి చేరుకుని వైద్య సేవలు అందిస్తామన్నారు. కోసిగి, కౌతాళం మండలాలకు ఒక వాహనం కేటాయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది గురునాథ్, పైలెట్ ఎల్లప్ప ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**దేవనకొండ:** మండలంలోని ఈరంపల్లి గ్రామ సమీపంలో ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్ల మండలం హెచ్. కైరవాడి గ్రామానికి చెందిన వడ్డె దండగల రాజశేఖర్ (29) ఏపీ 21 ఏఆర్ 0518 బైక్‌పై దేవనకొండ గ్రామం వైపు వెళుతున్నాడు. ఎదురుగా ఎక్స్ఎల్ వాహనంపై బాలకంప రాంబాబు మాచాపురం గ్రామం నుంచి కోడుమూరుకు వెళుతున్నాడు. ఈరంపల్లి గ్రామం సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. రాజశేఖర్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందారు.

### నిత్య పూజలకు నేడు విరామం

**మంత్రాలయం రూరల్:** రాఘవేంద్రస్వామి మఠంలో బుధవారం ఏకాదశి సందర్భంగా నిత్య పూజలకు విరామం ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేవలం స్వామి నిజ మూల బృందావనం దర్శనం మాత్రం భక్తులకు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళహారతి, పీఠాధిపతి ఆశీర్వాదం, అన్నదానం, ప్రసాదాల పంపిణీ ఉండవన్నారు.

### రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

**తుగ్గలి:** మండలవ్యాప్తంగా గురువారం నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వీర్రాజు తెలిపారు. మండలంలోని 18 సచివాలయాల పరిధిలో 7,585 మంది పింఛన్‌దారులకు పంపిణీ చేసేందుకు రూ.2,09,92,500 నగదు మంజూరైందన్నారు.

## అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

**కౌతాళం:** దేశంలో అన్ని వర్గాల వారికి సమాన హక్కుల కల్పించిన నేత డాక్టర్ అంబేడ్కర్ అని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, కౌతాళం సింగల్ విండో మాజీ అధ్యక్షుడు వీరసేనరెడ్డి అన్నారు. కామవరం గ్రామంలో మంగళవారం గ్రామ నాయకులు అధికారులు, దళిత నాయకులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. అతిథులుగా పాల్గొన్న తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, వీరసేనరెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సమాన హక్కులు కలిగేలా భారత రాజ్యాంగాన్ని నిర్మించిన మహానుభావుడు అంబేడ్కర్ అని కొనియాడారు. సర్పంచ్ వసంత, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, ఏఓ శేషాద్రి, దళిత నాయకులు తిమోతి, రాజబాబు, సరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఉన్నతికి పెద్దపీట



నదిచాగి గ్రామంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

**కౌతాళం:** పేద ప్రజల ఉన్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఉద్ఘాటించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలం పరిధిలోని నదిచాగి గ్రామంలో నాలుగో రోజు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ప్రదీప్‌రెడ్డితో కలిసి పర్యటించారు. గ్రామంలోని 150 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం నుంచి మంజూరైన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమ ధ్యేయంగా పని చేస్తోందన్నారు. పథకాల అమలు తీరును టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. సకల రంగాల ప్రగతి కోసం సీఎం జగనన్న శాయాశక్తులా కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. చంద్రబాబు కాపీ కొట్టి ఎన్ని మేనిఫెస్టోలు విడుదల చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామన్నారు. గతేడాది 5 ఎత్తిపోతల పథకాలకు సుమారు రూ.70 కోట్లతో శంకుస్థాపన చేశామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా పల్లెల్లో తాగునీటి కష్టాలు తీర్చేందుకు రూ.6.7 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. గ్రామంలోని బసవేశ్వర నగర్‌లో విద్యుత్ స్తంభాలు, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వేయాలని కోరగా తాగునీరు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామని రోడ్డు నిర్మాణానికి కొంత సమయం పడుతుందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. గ్రామ నాయకులు, సర్పంచ్ ఎంపీటీసీ, గృహసారథులు, గ్రామ కన్వీనర్ల సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులకు మేలు జరిగేలా చూడాలని సూచించారు. సర్పంచ్ మహేష్, ఎంపీపీ అమరేష్, జెడ్పీటీసీ రాధప్రియదర్శిని, నాయకులు రామన్నగౌడ్, నాగరాజ్‌గౌడ్, ప్రహ్లాదచారి, లింగన్నగౌడ్, పాల్‌దినకర్, ఎంపీడీఓ విజయ్‌శేఖర్, తహసీల్దార్ రామేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మంత్రాలయానికి డిగ్రీ కళాశాల మంజూరు

**మంత్రాలయం రూరల్:** నియోజకవర్గ కేంద్రం మంత్రాలయానికి డిగ్రీ కళాశాల మంజూరైందని అందుకు కావల్సిన స్థలాన్ని చూపాలని కోరుతూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు మండల తహసీల్దార్ చంద్రశేఖర్ మంగళవారం పేర్కొన్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి వినతి మేరకు నియోజకవర్గ కేంద్రానికి డిగ్రీ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందు కోసం రెండెకరాలకుపైగా ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే స్థలాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అలాగే అగ్నిమాపక కేంద్రానికి కావల్సిన స్థలాన్ని తుంగభద్ర నది ఒడ్డున ఎంపిక చేసినట్లు తెలిపారు.

### కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడుదాం

**ఆదోని రూరల్:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడదామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.ఎస్.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆవిర్భవించి 53 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదోని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆపార్టీ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షులు పి.ఎస్.రాధాకృష్ణ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమం పట్టణ అధ్యక్షుడు బి.తిప్పన్న అధ్యక్షతన జరిగింది. రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి పి.ఎస్.గోపాల్, నాయకులు బి.రాజు, హనుమంతు, ఆటో, హమాలీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### 1నుంచి యోగా శిక్షణ శిబిరం

**మంత్రాలయం రూరల్:** జూన్ ఒకటో తేది నుంచి మంత్రాలయం పరిమళ పాఠశాలలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ఆఫ్ లివింగ్ టీచర్ నరేష్‌కుమార్ సోమవారం పే ర్కొన్నారు. ఒకటో తేదీ నుంచి 5వరకు శిక్షణ కార్యక్ర మం ఉంటుందనితెలిపారు.ఐదు రోజుల పాటు యో గా, ప్రాణాయమం, సుదర్శన క్రియపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. దీంతో మానసిక, శారీరక ఆరోగ్యం, మెరుగైన రోగనిరోధక స్థాయిల పెంపు, ఒత్తిడిని త్వర గా, సమర్థవంతంగా తగ్గించే పద్ధతులపై శిక్షణ ఇస్తామన్నారు.ఆసక్తి కలిగినఅభ్యర్థులు 86395 13710 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### ఖాళీ స్థలాలను పేదలకు కేటాయించాలి

**మంత్రాలయం రూరల్:** మంత్రాలయం రాఘవేంద్రపురం కాలనీలో 1999–2000లో పేదలకు ఇంటి స్థలాలను ఇచ్చారని, అందులో ఖాళీ స్థలాలుగా ఉన్న వాటిని గుర్తించి జగనన్న కాలనీలో స్థలాలు అందని పేదలకు మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ చంద్రశేఖర్‌కు మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య మంగళవారం వినతి పత్రం సమర్పించారు. సదరు ఖాళీస్థలాల్లో అక్రమాలు కూడా జరిగినట్లు ఆరోపించారు. అధికారులతో ప్రత్యేక బృందాలుగా ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి అవి ఎవరికి సంబంధించినవనే విషయాలను తెలపాలన్నారు. చాల మంది నిబంధనలను ఉల్లంఘించి విక్రయాలు చేసినట్లు తెలిపారు. వారి పేరిట పట్టాలు మార్చుకున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే వాటిని వెలికితీసి అర్హులకు అందజేయాలని కోరారు.

## బాలుడి కుటుంబానికి సాయం అందించాలి

**ఆదోని సెంట్రల్:** తేలుకాటుకు గురై చికిత్స పొందుతూ మరణించిన బాలుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కే.అజెయ్‌బాబు, పట్టణ కార్యదర్శి సుదర్శన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆసుపత్రి అవరణలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అస్పరి మండలం హలిగేర గ్రామానికి చెందిన బాలుడిని చికిత్స కోసం తీసుకొస్తే డాక్టర్లు, వైద్య సిబ్బంది సకాలంలో స్పందించలేదని ఆరోపించారు. బాలుడి కుటుంబానికి రూ.25 లక్షలు అర్థిక సాయం అందించి ఆదుకోవాలని సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.వెంకన్న, నాగరాజ్‌గౌడ్, శ్రీనివాసఆచారి తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా సేవలందించండి



వలంటీర్‌కు సేవా వజ్రా పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

**కౌతాళం:** వలంటీర్లు బాధ్యతాయుతంగా పని చేసి గ్రామానికి, నియోజకవర్గానికి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సూచించారు. మంగళవారం నదిచాగి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నదిచాగి, వల్లూరు, గుడికంబాలి, మరళి, మేళిగనూరు, కుంబళనూరు, కుంబళనూరు క్యాంపు వలంటీర్లకు సేవా పురస్కారాలను అందజేశారు. నదిచాగి గ్రామానికి చెందిన వలంటీర్ రంగన్నగౌడ్‌కు సేవ వజ్ర అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లదే ప్రధాన పాత్ర అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయ సాధనకు వలంటీర్లు కృషి చేయాలన్నారు. లోకేష్ పాదయాత్రతో ఒరిగేదేమీ లేదని, దిక్కుతోచని స్థితిలో చంద్రబాబు, లోకేష్ ప్రభుత్వం నిరాధార ఆరోపణలు చేస్తున్నారేన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

**తాగునీటి పథకానికి భూమిపూజ**

మండల పరిధిలోని మరళి గ్రామంలో తాగునీటి పథకానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. తుంగభద్ర నది నుంచి గ్రామానికి తాగునీటి పైప్‌లైన్ కోసం ఎంపీ ఫండ్స్ రూ.13.5 లక్షలతో చేపట్టే పనులకు ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పనులు తొందరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

**కార్యకర్తలకు అండగా ఉంటాం**

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. ఈనెల 2వ తేదీ కుంబళనూరు క్యాంపుకు చెందిన సీనియర్ నాయకుడు శేషారావు గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మృతి చెందిన వారానికే ఈనెల 10న ఆయన చిన్న కుమారుడు కుంబళనూరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ శివకుమార్ గుండెపోటుతో మృతి చెందడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. మంగళవారం ఎమ్మెల్యే బాధితుల ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ రాధప్రియదర్శిని, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, కోఆప్షన్ మెంబర్ మహబుబ్ సాబ్, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, నాయకులు అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## నిర్మించారు.. వదిలేశారు



కోసిగిలో నిరుపయోగంగా ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్

**కోసిగి:** మండల కేంద్రంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ (చెత్త సంపద సృష్టి కేంద్రం) నిర్వహనా లోపంతో నిరుపయోగంగా మారింది. కేంద్రం ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దాదాపు రూ.10 లక్షలతో షెడ్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం నిరుపయోగంగా వదిలేశారు. గ్రామంలో చెత్తచెదారాన్ని సేకరించి షెడ్డుకు తరలించి సేంద్రయి ఎరువులు తయారు చేసి రైతులకు సబ్సిడీపై అందించాల్సి ఉంది. అయితే మెయింటెండెన్స్ గ్రాంటు విడుదల చేయకపోవడంతో చెత్త సంపద సృష్టి కేంద్రం వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన షెడ్డు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. సంబంధిత అధికారులు స్పందించి షెడ్డును వినియోగంలోకి తెచ్చి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన అవసరం ఉంది.